ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 253
శనివారం 26 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## మంత్రి నాదెండ్ల కోటలో రాజకీయం ఎలా ఉంది..?

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 25)**

తెనాలి నియోజకవర్గంలోని మండలాల పరిధిలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తరపున జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తుండగా, రాజకీయాల్లో జోరు కనిపిస్తోంది. ఇదే సమయంలో వైసీపీలో నాయకుల లేమి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుల వ్యవహారం బేజారుగా మారింది. గతంలో కేవలం తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ మధ్యే సాగిన ప్రధాన పోటీ, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్ రంగ ప్రవేశంతో త్రిముఖ పోరుగా మారి, చివరకు కూటమి విజయం సాధించింది. ▶2లో



## అత్యున్నత శిఖరం చేరినా సేవా మార్గాన్ని వీడం

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 25)**

రాజకీయంగా అత్యున్నత స్థానాలకు చేరినప్పటికీ సేవా మార్గాన్ని వీడబోమని, ప్రజాసేవే తమకు పరమావధి అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భాజపా ప్రభుత్వాల పాలన, విలువలకు ఇదే మూలాధారమని చెప్పారు. 'సేవా సంకల్ప్ యాత్ర'లో భాగంగా గుజరాత్‌లోని వడ్‌నగర్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి వరకు బైక్ యాత్ర చేపట్టిన సేవా యాత్రికులతో వీడియో కాన్ఫరెన్స్ ▶2లో

# 3 నెలల్లోనే గూగుల్.. 17 నెలల్లో ఆర్సెలర్.. ఏపీ స్పీడ్ ఇదేనన్న లోకేశ్

- వికసిత్ భారత్ నిర్మాణంలో ఏపీని గ్రోత్ ఇంజన్‌గా నిలుపుతామన్న లోకేశ్
- అహ్మదాబాద్‌లో గుజరాత్ పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశం
- ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడి
- ప్రభుత్వ పనితీరు బుల్లెట్ ట్రైన్ వేగంతో ఉంటుందని పెట్టుబడిదారులకు హామీ
- గుజరాత్, ఏపీ కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని వ్యాఖ్య



2

## ఎమ్‌డిఆర్ ట్యాక్సో, సెస్సో కాదు.. ప్రభుత్వానికి రూపాయి రాదు నిర్మలా సీతారామన్

**షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 25)**



యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ (MDR On UPI) విధింపుపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రతిపాదిత రుసుములు కేవలం రూ.2వేల కన్నా అధికంగా ఉన్న యూపీఐ లావాదేవీలకే వర్తిస్తాయని గుర్తు చేశారు. అలాగని ఇది పన్నో, సెస్సో కాదని, సర్‌ఛార్జీ అంతకంటే కాదని పేర్కొన్నారు. దీంట్లో ఖజానాకు వచ్చేది ఏమీ ఉండదని స్పష్టంచేశారు. డిజిటల్ పేమెంట్స్ ఎకో సిస్టమ్‌లో యూపీఐ సేవలందిస్తున్న పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు, మర్చంట్ బ్యాంకులు, అందులోని భాగస్వామ్య పక్షాలకే ఈ మొత్తం చేరుతుందని వెల్లడించారు."ఇది పన్ను కాదు, సెస్ కాదు, సర్‌ఛార్జ్ కూడా కాదు. ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరదు. మొత్తం ఎండీఆర్‌లో 40 శాతం వినియోగదారులు ఉపయోగించే బ్యాంకులకు, 30 శాతం పేమెంట్ గేట్‌వేకి, 20 శాతం యూపీఐ యాప్‌కి, మిగిలిన 10 శాతం యూపీఐ యాప్ స్పాన్సర్ బ్యాంకుకు వెళ్తుంది. ఈ రుసుములు వ్యాపారి మాత్రమే భరించాలి" అని నిర్మలా సీతారామన్ తెలిపారు. ▶2లో

## వైసీపీ శక్తి మంతం అవుతుందా.. ఘర్‌వాపసీపైనే ఆశలు ..!

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 25)**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మళ్లీ శక్తిమంతం అవుతుందా లేదా అనేది ఆ పార్టీ అంతర్గత వ్యూహాలు, ప్రజాదరణ, 'ఘర్ వాపసీ' (పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడం) వంటి చర్యలపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే.. ఇప్పుడు కొత్త చర్చ ప్రారంభమైంది. ఘర్ వాపసీని ప్రధానంగా చేసుకుని రాజకీయాలు చేయాలని పైనుంచి క్షేత్రస్థాయి నాయకులకు ఆదేశాలు అందాయి. 2024 ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నిరాశ పెరిగిన నేపథ్యంలో, పూర్వ వైభవాన్ని సాధించడానికి జగన్ విభిన్న ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ క్రమంలో 'ఘర్ వాపసీస అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. దీంతో 'ఘర్ వాపసీ'పై ఆశలు పెరుగుతున్నాయి. పాత కాపుల కలయికకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండి, వివిధ కారణాల వల్ల పార్టీని వీడిన లేదా దూరంగా ఉన్న సీనియర్ నేతలను, అలాగే తటస్థంగా ఉన్న పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడానికి వైసీపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న పాత నేతలు తిరిగి వస్తే, నిరాశలో ఉన్న నియోజకవర్గ స్థాయి క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం వస్తుందని పార్టీ భావిస్తోంది. మరోవైపు.. ▶2లో

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 25)**



ఉత్తర్‌ప్రదేశ్‌లోతయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని ▶2లో

## షర్మిల కమిటీలు.. కాలయాపనేనా ..!

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 25)**



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వైఎస్ షర్మిల పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమె పార్టీ నాయకత్వాన్ని, కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. ఒకవైపు కుమార్తె అంజలి వివాహ వేడుకల్లో బిజీగానే ఉన్నప్పటికీ.. మరోవైపు రాజకీయంగా పార్టీపై తన పట్టు నిలుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమం లోనే షర్మిల కొత్తగా కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ కమిటీలు ఇప్పటి వరకు చార్జి తీసుకోకపోవడతో ఇవి కాలయాపన కోసం వేసిన కమిటీలా? లేక.. నిజం గానే పనిచేస్తున్నాయా? అనేది ఆసక్తిగా మారింది. రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసిన షర్మిల.. దీనికి కీలక బాధ్యతలు అప్పగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇటీవల సీనియర్ నేత, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి ఛైర్మన్‌గా 10 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయి సమన్వయాన్ని పర్యవేక్షించాలన్నది షర్మిల పెట్టుకున్న లక్ష్యం. అయితే.. ఇప్పటి వరకు రఘువీరా రెడ్డి బాధ్యతలు చేపట్టిన ▶2లో

## హర్మూజ్ వద్ద యుద్ధంలోకి అమెరికా లేజర్ వెపన్స్..

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 25)**



ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా అత్యాధునిక క్షిపణులు, డ్రోన్లను విరివిగా వాడుతోంది. తాజాగా అగ్రరాజ్యం తన అమ్ముల పొదిలోని లేజర్ వెపన్స్ శక్తిని హర్మూజ్‌లో ప్రయోగిస్తున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వీటితో ఇప్పటికే హర్మూజ్ వద్ద అనేక క్రూజ్ క్షిపణులు, డ్రోన్లను కూల్చినట్లు తెలిపాయి. మార్పులు చేసిన ఎక్స్‌బాక్స్ గేమ్ కన్సోల్ కంట్రోలర్లను ఈ లేజర్ ఆయుధాల ఆపరేటింగ్‌కు వాడుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టుపై 500 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు సమాచారం. క్షిపణుల వంటి ఖరీదైన ఆయుధాలను ఉపయోగించడం కంటే ఈ లేజర్ ఆయుధాల ద్వారా.. హర్మూజ్ పై డ్రోన్‌లను, క్రూజ్ క్షిపణులను సమర్థంగా ధ్వంసం చేస్తున్నట్లు అమెరికా సైనిక వర్గాలు వెల్లడించాయి. వీటిద్వారా డ్రోన్‌లను ట్రాక్ చేసి.. పేల్చివేస్తున్నట్లు తెలిపాయి.

**ఎలా పని చేస్తాయి..? :** ఈ లేజర్ ఆయుధాల సాంకేతికను అమెరికా సుమారు 50 ఏళ్లుగా అభివృద్ధి చేస్తోంది. సంప్రదాయ యాంటీ-డ్రోన్, యాంటీ-మిసైల్ వ్యవస్థల్లా.. లేజర్ ఆయుధాలకు భౌతిక ఇంటర్‌సెప్టర్ అవసరం లేదు. ఈ ఆయుధాలు జనరేటర్లు లేదా బ్యాటరీ ప్యాక్‌ల నుంచి శక్తిని గ్రహించి.. దానిని ఫోటాన్లుగా మారుస్తాయి. అనంతరం వాటి కాంతి కణాలు లక్ష్యం ఉపరితలంపై పడి అది కాలిపోయేంత వేడిని పుట్టిస్తాయి. ఇతర ఆయుధాలతో పోలిస్తే.. వీటి ధర కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకు వీటిని యుద్ధ నౌకలపై మాత్రమే ప్రయోగించారని.. మానవ లక్ష్యాలపై ఉపయోగించలేదని నిపుణులు పేర్కొన్నారు. ఈ ఆయుధాలను మరింత అభివృద్ధి చేయగలిగితే ప్రపంచ దేశాలు ఇకపై మందుగుండు సామగ్రి నిల్వల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండబోదన్నారు. అయితే యుద్ధ భూమిలో ఈ లేజర్ ఆయుధాల వాడకాన్ని ట్రంప్ యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

# 3 నెలల్లోనే గూగుల్..
# 17 నెలల్లో ఆర్సెలర్..
## ఏపీ స్పీడ్ ఇదేనన్న లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 25)

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్ స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడు-మోదీజీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో-650' అని పిలుస్తారని అన్నారు.

పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు.గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# షర్మిల కమిటీలు..
# కాలయాపనేనా ..!

పరిస్థితి కనిపించలేదు. .క్షేత్రస్థాయి పర్యటనలు – సమీక్షలు కూడా చేయడం లేదు. ముఖ్యంగా గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ఏకైక అజెండాగా పనిచేయాలని ఆమె జిల్లా, నగర కమిటీలకు దిశానిర్దేశం చేశారు. ఆయా కమిటీలు రఘువీరా కమిటీతో కలిసి పనిచేయాలన్నారు.

కానీ, ఆ తరహా పరిస్థితి కనిపించడం లేదు. వివిధ జిల్లాల్లో (ఉదాహరణకు నంద్యాల) పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాల్లో ఆధిపత్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపించింది. స్థానిక పరిస్థితులు అర్థం చేసుకోవాలని నాయకులు కోరుతున్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి పార్టలో ఉన్న కొందరికి అన్యాయం చేస్తున్నారని.. మెజారిటీ నాయకులు చెబుతున్నారు. కొత్త వారికి కూడా అవకాశాలు ఇవ్వాలని కోరుతున్న వారు మరికొందరు ఉన్నారు. ఇలా.. కమిటీలు వేసినా.. అవి పనిచేయక పోవడం.. క్షేత్రస్థాయి నాయకత్వంలో ఆధిపత్య ధోరణులు పెరగడం వంటివి చర్చకు దారి తీస్తున్నాయి.

# మంత్రి నాదెండ్ల కోటలో రాజకీయం ఎలా ఉంది..?

ప్రస్తుతం తెనాలి టౌన్, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల పరిధిలో తాజా రాజకీయ సమీకరణాలు మారుతున్నా యి. ఇవి కూటమికి అనుకూలంగా ఉన్నాయి. కూటమి నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ నాయకత్వంలో శ్రేణులు జోరుమీదున్నారు. మనోహర్ నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు నిరంతరం పర్యటిస్తున్నారు. అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. ఇటీవల కాలంలో నియోజకవర్గ పరిధిలోని తాగునీటి సమస్యల పరిష్కారానికి, రహదారుల నిర్మాణాలకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

రాజకీయ వార్తలు చదవండి : గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసిన టీడీపీ స్థానిక నేతలు, జనసేన శ్రేణులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. వైసీపీ విషయానికి వస్తే.. కేంద్ర కార్యాలయం చేరువగానే ఉన్నా.. నియోజకవర్గంపై పట్టు సాధించక పోవడం గమనార్హం. గత ఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇతర ముఖ్య నాయకులు నియోజకవర్గంలో కార్యక్రమాలకు ముక్తసరిగా హాజరవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలాల వ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నాయకులు అలర్ట్ అవుతున్నారు. వార్డులు, గ్రామాల పరిధిలో పట్టు నిలుపుకోవడానికి అధికార కూటమి అంతర్గత వ్యూహాలు రచిస్తుండగా, వైసీపీ మాత్రం తిరిగి పుంజుకోవడానికే పరిమితం అవుతోంది. మొత్తంగా చూస్తే, తెనాలి టౌన్, రూరల్ మండలాల పరిధిలో ప్రస్తుతం అధికార పక్షం అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్తుండగా, ప్రతిపక్షం మాత్రం కేడర్‌పై వస్తున్న కేసులను ఎదుర్కొంటూ రాజకీయ ఉనికి కోసం ప్రయాస పడుతోంది.

# అత్యున్నత శిఖరం చేరినా సేవా మార్గాన్ని వీడం

ద్వారా ప్రధాని మోదీ మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవం, ప్రజాప్రతినిధిగా ఎన్నికై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 17న ప్రారంభమైన ఈ యాత్ర గురువారం మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాకు చేరింది. 'రాజకీయాలు, ఎన్నికలు, పాలనా విషయాలు ఎలా ఉన్నప్పటికీ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణమే భాజపా ప్రధాన లక్ష్యమ'ని ప్రధాని మోదీ తెలిపారు. తన జీవిత ప్రయాణానికి ప్రజల ఆశీస్సులే ప్రధాన శక్తిగా నిలిచాయని పేర్కొన్నారు. 'సేవా భావంతో చేసిన పనులను ప్రజలు గుర్తుంచుకుంటారు. సేవ చేసే వారికి ప్రజల ఆశీస్సులు లభిస్తాయి. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో యువశక్తి పాత్రను మనం అత్యంత బలంగా ముందుకు తీసుకెళ్లాలి. నేటి యువతరమే వికసిత భారత్ నిర్మాతలు. ఈ అభివృద్ధి ఫలాల అత్యధిక లబ్ధిదారులు కూడా వారే' అని ప్రధాని మోదీ తెలిపారు.

20 బృందాలు.. 35,500 కి.మీ. ప్రయాణం..

'సేవా సంకల్ప్ యాత్ర'లో మొత్తం 20 బృందాలు భాగస్వాములవుతున్నాయి. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 7 వరకు సుమారు 35,500 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగనుంది. వడ్‌నగర్ నుంచి వారణాసి, అక్కడి నుంచి తిరిగి వడ్‌నగర్ వరకు ఈ బృందాలు ప్రయాణించనున్నాయి. ఇది కేవలం మోటార్‌సైకిల్ యాత్ర మాత్రమే కాదని నిర్వాహకులు చెబుతున్నారు. పట్టణాలు, జిల్లాలు, తాలూకాలు, గ్రామాల్లో ఆగుతూ స్థానిక ప్రజలను కలుసుకుని, అక్కడి అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేపట్టేలా యాత్రను రూపొందించారు.

# ఎమ్‌డిఆర్ ట్యాక్సో, సెస్సో కాదు.. ప్రభుత్వానికి రూపాయి రాదు

డిజిటల్ చెల్లింపుల సాంకేతిక మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి, మెరుగుదలకు, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి ఈ ఛార్జీని చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వామి వర్గాలే పంచుకుంటాయని స్పష్టంచేశారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలపై ఇప్పటికే వ్యాపారులు ఎండీఆర్ చెల్లిస్తున్నారని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. యూపీఐలో లావాదేవీలపై ఎండీఆర్‌ను వినియోగదారులపై పడే ఛార్జీగా చూడకూడదన్నారు. రూ.2 వేలు వరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపారు. వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ పరిధిలోకి రావని పేర్కొన్నారు. ప్రతిపాదిత ఎండీఆర్ వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్న విమర్శల వేళ నిర్మలా సీతారామన్ ఈ మేరకు స్పష్టతనిచ్చారు. అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి.

# వైసీపీ శక్తి మంతం అవుతుందా.. ఘర్‌వాపసీపైనే ఆశలు ..!

రాజకీయ వర్గాల్లో కాంగ్రెస్, వైసీపీల మధ్య భవిష్యత్తులో ఏదైనా రాజకీయ సమన్వయం లేదా విలీనం వంటి 'ఘర్ వాపసీ' జరుగుతుందా అనే చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే ప్రాంతీయ అస్తిత్వాల రీత్యా ఇవి అంత సులభం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ శక్తిమంతం కావడానికి ఉన్న సవాళ్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పలువురు ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు అధికార కూటమి వైపు మళ్లారు.

రాజకీయ వార్తలు చదవండి

స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైసీపీలో ఆందోళనకు ఇది కారణమైంది. పార్టీకి పెద్ద సవాలుగా మారింది. దీంతో కేవలం నాయకులు తిరిగి రావడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి, యువతలో పార్టీపై ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకోవడం అత్యవసరమని భావిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో లేదా పరిపాలనలో విఫలమైతే, ఆ ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడానికి బలమైన ప్రతిపక్షంగా వైసీపీకి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏదేమైనా.. ప్రస్తుతం దీనిపై భారీగానే కసరత్తు చేస్తున్నారు.

# 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు: అమిత్ షా

గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమై ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద అప్రమత్తంగా ఉండాలి

### అనుమానాస్పద వ్యక్తుల కదలికల పై పోలీసులకు సమాచారం ఇవ్వాలి





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 25)

సమ్మె, వరుస సెలవుల నేపథ్యంలో బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు అర్బన్ పోలీస్ ఇన్స్పెక్టర్ కె రమణారెడ్డి సూచించారు. కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మైదుకూరు డీఎస్పీ జి రాజేంద్ర ప్రసాద్ సూచనలతో మైదుకూరు పట్టణ, మండల పరిధిలోని బ్యాంకులు, ఏటీఎంల వద్ద పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. బ్యాంకులు, ఏటీఎంల పరిసరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు గమనించినా, అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పోలీసులు తనిఖీ చేసి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించారు.

వరుస సెలవుల నేపథ్యంలో ప్రజలు, బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు.

# విత్తన బంతులతో అడవుల అభివృద్ధికి బాట

### లక్ష బంతులను డ్రోన్లతో వెదజల్లిన అటవీ శాఖ




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టంబర్ 25)

మండలంలోని తంగిరాలపల్లి పంచాయతీ పరిధిలోని తమ్మడపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం విత్తన బంతుల వెదజల్లింపు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హానోక్ తెలిపారు. ఇందులో భాగంగా లక్ష విత్తన బంతులను తయారు చేసి, డ్రోన్ల సహాయంతో అటవీ ప్రాంతంలో వెదజల్లడం జరిగింది. అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం, వర్షాలకు అనుగుణంగా సహజంగా మొక్కలు మొలకెత్తేలా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు విత్తన బంతుల తయారీ విధానం, వాటి ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ డైరెక్టర్ నక్కా శ్రీను, యూనిట్ ఇంచార్జ్ తోకల యల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దండెబోయిన వెంకటేశ్వర్లు, లింగాల అచ్యుతరావు, స్థానికులు కన్నెబోయిన శివ, నక్కా పిచ్చయ్య, కుర్రా సాయి, తదితరులు పాల్గొన్నారు.

# 27 ఆదివారం అన్ని బ్యాంకు శాఖలు పనిచేస్తాయి

### లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ మేనేజర్ ఎస్ కే షాహీర్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 25)

సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె దృష్ట్యా, లిరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 27 ఆదివారం రోజున జిల్లాలోని అన్ని బ్యాంకు శాఖలు పని దినంగా పనిచేస్తాయని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎస్ కే షాహీర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ అవకాశా న్ని బ్యాంకు ఖాతాదారులు ఉపయోగించుకోవాలని ఆయన ఆ ప్రకటన లో కోరారు.

# ఘనంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, జగ్గంపేట, సెప్టంబర్ 25)

మండల కేంద్రంలో బిజెపి కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పల్లా రాము అధ్యక్షతన పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన దయాళ్ చూపిన స్వయంసమృద్ధి (స్వదేశీ), దేశ నిర్మాణం, నిస్వార్థ సేవా మార్గంలో నడవడమే మనం ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి రమ్య, మండల ఉపాధ్యక్షుడు పదిలం సోమశేఖర్, గొల్లి సతీష్, కార్యదర్శి షోరూమ్ పూడి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం మార్కాపురం బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

26.09.26 శనివారం

## వైసీపీ నేత కాకుమాను రాజశేఖర్ మృతి పై శవ రాజకీయాలు సిగ్గుచేటు

### హత్యా, శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గొడ్డలి పార్టీ

### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



(షణ్ముఖ వెలుగు, కొండపి, సెప్టెంబర్ 25)

వైసీపీ నేత కాకుమాను రాజేశేఖర్ మృతి పై వైసీపీ శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. శుక్రవారం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హత్యా, శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గొడ్డలి పార్టీ. వైసీపీ నేత కాకుమాను రాజేశేఖర్ మృతి పై వైసీపీ శవ రాజకీయాలు చేస్తోంది. రాజశేఖర్ పై నిజంగా పోలీసులు దాడి చేసి ఉంటే, ఆయన్ని గొడ్డలి పార్టీ వెంటనే ఎందుకు హాస్పిటల్లో చేర్చలేదు? నాడు జగన్ అండ్ కో తమ సొంత బాబాయిని చంపి చంద్రబాబు నాయుడు పై ▶4లో

# కాకుమాను హఠాన్మరణానికి కూటమి ప్రభుత్వమే కారణం

### రాజశేఖర్ పై అక్రమ కేసులు, పోలీసుల వేధింపులు

### రాజ్యసభ సభ్యులు వై వి సుబ్బారెడ్డి ఫైర్

### పోలీసులను కిరాయి సైన్యంగా మార్చిన చంద్రబాబు ప్రభుత్వం

### డీఎస్సీ నిరసనలో పోలీసుల తోపులాటే రాజశేఖర్ మృతికి కారణం

### ప్రభుత్వ తీరు పై సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 25)



హైదరాబాద్‌లో గురువారం హఠాన్మరణానికి గురైన వైయస్సార్‌సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ పార్థివ దేహానికి ఆయన స్వస్థలమైన ఒంగోలులోని క్లోపేటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వై వి సుబ్బారెడ్డి, పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు, పలువురు పార్టీ నేతలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారు, ఆయన పార్టీకి చేసిన సేవలు స్మరించుకున్నారు. కాకుమాను రాజశేఖర్ మరణం పార్టీకి తీరని లోటని వారు గుర్తు చేశారు. డిఎస్సీలో అక్రమాల పై విజయవాడ శాప్ కార్యాలయం వద్ద నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పోలీసులు చేసిన దాడి, వారి తోపులాటల వల్ల రాజశేఖర్ రెండు మూడు సార్లు కింద పడిపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యారని, ఆ దుర్ఘటనే ఆయన మరణానికి ప్రధాన కారణమని పార్టీ నాయకులు, కాకుమాను కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గానికి, కిరాయి సైన్యంలా మారిన పోలీస్ యంత్రాంగ అరాచకాలకు నిదర్శనమని వారు ధ్వజమెత్తారు. రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పై రాజీ లేని పోరాటం చేసిన యోధుడు కాకుమాను రాజశేఖర్. ఆయన కుటుంబానికి వైయస్సార్సీపీ పూర్తి అండగా ఉంటుంది. ఒంగోలు పట్టణంలో కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగిన కాకుమాను రాజశేఖర్ నిరంతరం ప్రజా సమస్యలపైనే పోరాడారు. ఇటీవల కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. డీఎస్సీలో అక్రమాలపై ఈనెల 22న విజయవాడ, శాప్ ఆఫీస్ వద్ద నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ▶4లో

## ఒంగోలు చరిత్రలో అరుదైన ఘట్టం..!

### 150 ఏళ్ల ప్రస్థానానికి ఘనంగా వేడుకలు

### అకాల వర్షాలతో మూడు రోజుల వేడుకలు ఒక్కరోజుకే పరిమితం

### వేడుకలకు సంబంధించిన వివరాలను వెల్లడించిన ప్రాజెక్టు ఆఫీసర్ సంక్రాంతి వెంకటకృష్ణ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 25)



150 ఏళ్ల చరిత్ర కలిగిన ఒంగోలు నగర వైభవాన్ని ఘనంగా చాటేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలుత ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితుల కారణంగా 28, 29 తేదీల్లో జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేసి, 30వ తేదీన ఒక్కరోజే ప్రధాన వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

150 ఏళ్ల చరిత్ర.. ఒక్కరోజు సంబరం..!

ఈనెల 30వ తేదీ ఉదయం 9 గంటలకు ఒంగోలు మినీ స్టేడియంలో 150 ఏళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ చారిత్రక కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు.

27న 5 వేల మందితో హెరిటేజ్ వాక్ : ప్రధాన వేడుకలకు ముందుగా ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు సుమారు 5 వేల మందితో భారీ హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఒంగోలు చారిత్రక ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించాల్సిన వేడుకలు వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక్కరోజుకే పరిమితమైనప్పటికీ, ఒంగోలు 150 ఏళ్ల చరిత్ర, వైభవాన్ని ఘనంగా చాటేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



## మార్కాపురం జిల్లా అభివృద్ధికి నూతన శకం ప్రారంభం

### జెడ్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత

### వేములకోటలో వైభవంగా నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ప్రారంభోత్సవం

### ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

### ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యం

### ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 25)

మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యంలో భాగంగా వేములకోట గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) కార్యాలయం శుక్రవారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. ▶4లో

## అవయవ దానంతో అమరుడైన దయాళు పలువురికి పునర్జీవం

## అవయవ దానం...

### ఆ కుటుంబం తీసుకున్న గొప్ప మానవతా నిర్ణయం

### కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలులో అవయవ సేకరణ ప్రక్రియ







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 25)

మానవత్వానికి ప్రతీకగా నిలిచే గొప్ప నిర్ణయాన్ని తీసుకున్న ఓ కుటుంబం.. పలువురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకొచ్చింది. మార్కాపురం జిల్లా గజ్జలకొండ గ్రామానికి చెందిన మాజీ సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి అదిములపు దయాళు (55) అనారోగ్యంతో కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలులో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ అయ్యారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో అవయవ దానానికి అంగీకరించారు. అదిములపు దయాళు అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు కిమ్స్ హాస్పిటల్స్‌కు తరలించారు. వైద్య పరీక్షల్లో బ్రెయిన్ స్టెమ్ హెమరేజ్‌గా గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించిన అనంతరం ఆయనను బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. అవయవ దానం ప్రాధాన్యతను వైద్య బృందం కుటుంబ సభ్యులకు వివరించగా, మృతుడి భార్య విజయకుమారి, కుమార్తె అన్సి, సోదరులు చైతన్య, శివమణి అవయవ దానానికి ▶4లో

## ప్రకాశం జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు బాధ్యతల స్వీకరణ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 25)

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఒంగోలు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవీకాలం ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అందజేసినందున దానికి అనుగుణంగా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలను నిరంతరాయంగా జరిగే విధంగా కృషి చేయడం జరుగుతుంది అన్నారు. జిల్లా పరిషత్ అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కొత్తగా మరల ఎలక్షన్లు జరిగి చైర్మన్‌లను ఎన్నుకునేదాకా ఈ పదవి కాలం ఉంటుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాను చూసినట్లయితే 56 మండలాలు 784 మరియు 56 ఎంపీటీసీలు ▶4లో

# కాకుమాను హఠాన్మరణానికి కూటమి ప్రభుత్వమే కారణం



రాజశేఖర్‌పై పోలీసులు నెట్టివేతలు, తోపులాటకు దిగడంతో ఆయన రెండు సార్లు కిందపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఒంగోలు చేరుకున్న తర్వాత కూడా పోలీసులు అక్రమ కేసులు బనాయించారన్న వార్తలతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లిన కొద్ది నిమిషాల్లోనే తుదిశ్వాస విడిచారు. కూటమి ప్రభుత్వం సృష్టిస్తున్న ఒత్తిళ్లు, నమోదు చేస్తున్న అక్రమ కేసుల వల్లే ఒక సీనియర్ నేత ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.



నిరసన గళాన్ని తొక్కేసే క్రమంలో జరిగిన దుర్ఘటన ఇది
సజ్జల రామకృష్ణారెడ్డి

చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గ పాలనను ప్రజలే గమనించాలి. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిత్యం చురుగ్గా పనిచేస్తూ, ప్రచార కమిటీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన నిజమైన సహచరుడిని (ట్రూ కామ్రేడ్) కోల్పోవడం పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన ఘోరమైన అక్రమాలపై యువత పక్షాన నిలబడి శాప్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, తప్పును సరిదిద్దుకోవాల్సిన కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని దాడి చేయించింది. ఆ తొక్కిసలాట, పోలీసుల లాఠీఛార్జ్ సమయంలో రాజశేఖర్ పలుమార్లు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యారు. అనంతరం అర్ధరాత్రిళ్లు ఇళ్లపై పడి టెర్రరిస్టుల మాదిరిగా వేధించడంతో విపరీతమైన ఆందోళనకు గురై ఆస్పత్రి పాలైనట్లు తెలుస్తోంది. అధికారం ఉందని పోలీసు వ్యవస్థను కిరాయి సైన్యంలా వాడుకుంటూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా దాడులు ప్రభుత్వ హత్యల కిందకే వస్తాయి. అందుకే ఈ వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం, వారి గూండాయిజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలులో రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ పార్థివ దేహానికి రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వైస్సార్సీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ,ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రాహ్మానందరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కెపి నాగార్జునరెడ్డి, ఒంగోలు, కనిగిరి ఇన్‌ఛార్జిలు చూండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్, తదితరులు ఉన్నారు.

# నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే దామచర్ల వన్ టు వన్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 25)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు శుక్రవారం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలతో వన్ టూ వన్ టాక్ కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ కార్యకర్తల మీద వున్న కేసుల వివరాలు, వారి వ్యక్తిగత సమస్యలను, వారి పరిధిలో పార్టీ బలోపేతం పై మాట్లాడారు. సాధారణంగా ఎన్నికల సమయంలోనే కాకుండా కూటమి పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒంగోలు నగరంలోని కార్యకర్తలు, నాయకులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వచ్చే పది రోజులలో పార్టీలోని కమిటీ నాయకుల అందరితో మాట్లాడేలా ప్రణాళిక రూపందించాను అని తెలియజేసారు. శుక్రవారం క్లస్టర్ ఇంచార్జిలతో వన్ టూ వన్ గా మాట్లాడటం ప్రారంభించారు. ఒక్కో నాయకులతో 20 నిమిషాల నుండి 30 నిముషాలు పాటు వ్యక్తిగతంగా మాట్లాడారు. ఎమ్మెల్యే కార్యాలయం పనితీరు, నియోజకవర్గంలోని ఇతర నాయకుల పనితీరు పై ఏవైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా తనతో చెప్పమని ఈ సందర్బంగా ఎమ్మెల్యే జనార్ధన్‌రావు కోరారు. స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారుల తీరుతెన్నుల పై కూడా వివరంగా ఆరా తీశారు. ఈ వన్ టూ వన్ సమావేశాల్లో కేవలం రాజకీయ సమస్యలే కాక, ప్రతి నాయకుల కుటుంబ ఆర్థిక స్థితి, జీవనోపాధి, వారి పిల్లల చదువుల గురించి కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట తగిన సహాయం కూడా చేస్తున్నట్టు తెలియజేసారు.

# అవయవ దానంతో అమరుడైన దయాళు పలువురికి పునర్జీవం అవయవ దానం...

సమ్మతి తెలిపారు. జీవన్‌దాన్ ద్వారా అవసరమైన అనుమతులు పొందిన అనంతరం అవయవ సేకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ అవయవ దానం కేవలం వైద్య ప్రక్రియ కాదని, గొప్ప మానవతా సేవ అని అన్నారు. ఒక వ్యక్తి తీసుకునే నిర్ణయం అనేక కుటుంబాలకు కొత్త జీవితాన్ని అందించగలదని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్ అనంతరం అవయవ దానం ద్వారా పలువురు రోగులకు జీవితాన్ని తిరిగి పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులు చూపిన ధైర్యం, మానవత్వం అభినందనీయమన్నారు. కిమ్స్ యాజమాన్యం తరపున డైరెక్టర్ బి ఆద్విక్, సీఓఓ కె అంకిరెడ్డి, రీజినల్ సీఓఓ డాక్టర్ వి ప్రవీణ్ కుమార్ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి గొప్ప నిర్ణయాన్ని అభినందించారు. అవయవ దాన ప్రక్రియకు సహకరించిన జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ, జీవన్‌దాన్ అధికారులకు ఆసుపత్రి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

# వైసీపీ నేత కాకుమాను రాజశేఖర్ మృతి పై శవ రాజకీయాలు సిగ్గుచేటు

తప్పుడు ప్రచారం చేశారు. శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ గొడ్డలి పార్టీ, గొడ్డలి పార్టీ నేతలు ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం మాని చేతనైతే రాజశేఖర్ కుటుంబానికి అండగా నిలబడాలని మంత్రి స్వామి అన్నారు. కాకుమాను రాజశేఖర్ మృతి బాధాకరమని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు మంత్రి చెప్పారు.

# ప్రకాశం జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు బాధ్యతల స్వీకరణ

ఉన్నాయన్నారు. అప్పటివరకు మండల స్థాయి మరియు జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ పరుచుకుని పరిపాలన సాగించడం జరుగుతుందని అదేవిధంగా ప్రభుత్వ పథకాలను త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ లో వివిధ రకాల సమస్యలు ఉంటాయని ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా సమస్యలను పరిష్కరించడం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పంచాయతీ రాజ్ లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తూ ఎలక్షన్ విధులు నిర్వహించి సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ముఖ్య నిర్వహణ అధికారి చిరంజీవితో కలిసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు ఏ బాధ్యతలు ఏమిటి అని విపులంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ వారిని కలిసి అభినందనలు తెలిపారు.

# మార్కాపురం జిల్లా అభివృద్ధికి నూతన శకం ప్రారంభం



శుభ ముహూర్తమైన మధ్యాహ్నం 12:15 గంటలకు మార్కాపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఎం విజయసునీత నూతన జెడ్పీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ ప్రారంభోత్సవంలో పాల్గొని జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ప్రజలకు పాలనా సేవలను మరింత చేరువ చేయడంలో నూతన జెడ్పీ కార్యాలయం కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జిల్లా కలెక్టర్ విజయసునీతకు శుభాకాంక్షలు తెలిపారు.





# అంగరంగ వైభవంగా ప్రముఖ న్యాయవాది, కనిగిరి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ షేక్ ఇర్షాద్ అహ్మద్ వివాహ మహోత్సవం

## హాజరైన పలువురు ప్రముఖులు, రాజకీయ, కుటుంబ సభ్యులు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు, గుంటూరు, సెప్టంబర్ 25)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో కనిగిరి పట్టణానికి చెందిన ప్రముఖ మైనార్టీ టీడీపీ నాయకులు షేక్ జంషీర్ అహ్మద్, షేక్ గౌసియా బేగం (మాజీ ఎంపిటిసి) కుమారుడు, ప్రముఖ న్యాయవాది షేక్ ఇర్షాద్ అహ్మద్, కనిగిరి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, కౌసర్ బాజీల వివాహ వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. తెనాలిలోని ప్రసిద్ధ చావస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ ఈ వేడుకకు వేదికైంది. సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో విచ్చేసి నూతన వధూవరులు షేక్ ఇర్షాద్ అహ్మద్, కౌసర్ బాజీలను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల కోలాహలం మధ్య వేడుక అత్యంత ఘనంగా ముగిసింది. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు పఠాన్ అయుబ్, పఠాన్ మయూమున్, డాక్టర్ షేక్ షబీనా, పటాన్ సత్తాజ్, ముల్లా సాజిద్, ముల్లా ఫరహానా, షేక్ ఇర్ఫాన్ అహమ్మద్, సల్మా సుల్తానా, ముల్లా హసన్ వలి (బడే), ముల్లా సలీమా, షేక్ రహిమాన్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకకు విచ్చేసిన అతిథులకు కుటుంబ సభ్యులు ఘనంగా ఆతిథ్యం అందించారు.





# పెద్దకొత్తపల్లి అభివృద్ధికి రూ.77.50 లక్షల నిధులు మంజూరు

## ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, సెప్టంబర్ 25)

మండలంలోని పెద్దకొత్తపల్లి గ్రామ అభివృద్ధికి విబిజిరామ్‌జి నిధుల కింద రూ.77.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.50 లక్షలు, పేర్ల సావడి నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు రోడ్డు నిర్మాణానికి రూ.27.50 లక్షలు మంజూరు చేసినట్లు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్‌కు పెద్దకొత్తపల్లి గ్రామ పంచాయతీ తరపున మద్దిపాడు మండల నాయకులు నల్లూరి శ్రీనివాసరావు, గట్టినేని అయ్యన్న ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ సహకరిస్తున్నారని పిఎస్ఆర్ పేర్కొన్నారు. మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రహదారి పనులు చేపట్టి గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

## పల్లెపండుగ 3.0 ప్రారంభోత్సవం సందర్భంగా టీడీపీ శ్రేణుల సమీక్షా సమావేశం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 25)

ఈ నెల 29న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వరకుంటపాడు మండలం రామాపురం గ్రామానికి విచ్చేసి పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కనిగిరి నియోజకవర్గ టీడీపీ శ్రేణుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు శుక్రవారం కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్, డీలర్లు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, నాయకులు మరియు కార్యకర్తలకు అప్పగించాల్సిన బాధ్యతలు, ప్రజల భాగస్వామ్యం, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి, అవసరమైన సూచనలు మరియు దిశానిర్దేశం చేశారు.

## పట్టణ ఎస్ఐ దురుసు ప్రవర్తన పై జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనాకు అఖిలపక్ష నేతల ఫిర్యాదు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, సెప్టెంబర్ 25)

మార్కాపురం పట్టణ ఎస్ఐ పి విశ్వనాథరెడ్డి దురుసు ప్రవర్తన పై మార్కాపురం జిల్లాకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ పంకజ్ కుమార్ మీనాకు అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పంకజ్ కుమార్ మీనాను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు చట్ట ప్రకారంగా ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వకపోవడంతో సిపిఎం అండతో పోరాటం సాగిందని వివరించారు. మంత్రి నిమ్మల రామానాయుడు సైతం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో శాంతియుత ఆందోళనకు దిగాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమం శాంతియుతంగా జరుగుతుండగా పట్టణ ఎస్ఐ విశ్వనాథరెడ్డి గందరగోళం సృష్టించారన్నారు. సమాజంలో నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్యపై అమానవీయ పద్ధతిలో పిడిగుద్దులతో దాడి చేయడం, ఆ పై రోడ్డు పై ఈడ్చుకుంటూ మీటర్ల దూరం కొద్దీ వెళ్లిన ఘటన మార్కాపురం జిల్లా కలెక్టరేట్ సాక్షిగా జరిగిందన్నారు. అంతే కాకుండా గొంతు నులిమి ఊపిరి ఆడకుండా హత్యయత్నానికి పాల్పడ్డారన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన సంఘటన పై, దాడికి పాల్పడిన పట్టణ ఎస్ఐ విశ్వనాథరెడ్డి పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ పంకజ్ కుమార్ మీనాను కలిసిన వారిలో సిపిఐ సీనియర్ నాయకులు అందే నాసరయ్య, సిపిఎం మార్కాపురం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డికెఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి వందన్ కుమార్, కే విజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి సుదర్శన్, పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 25)

జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ నులిపురుగు నివారణ మాత్రలను అందజేశారు. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పివిఆర్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3,35,000 మంది పాఠశాల మరియు అంగన్‌వాడీ విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో నులిపురుగుల సమస్యను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ఒక చిన్న కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యానికి ఎంతో పెద్ద ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర కార్యక్రమ పరిశీలకులు జి రవీంద్ర కుమార్ కార్యక్రమాన్ని పరిశీలించి, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యం, ఆనందమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

### నులిపురుగు నివారణ మాత్రల ప్రాధాన్యత

నులిపురుగులు పిల్లల్లో పోషకాహార లోపం, బలహీనత, కడుపునొప్పి, ఆకలి తగ్గడం వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న



ఆల్బెండజోల్ మాత్రలను సూచించిన విధంగా తీసుకోవడం ద్వారా నులిపురుగుల సమస్యను నియంత్రించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. పిల్లలు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీటిని తాగడం, ఆహారాన్ని పరిశుభ్రంగా తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మ సునంద, డాక్టర్ పి కమలశ్రీ, ఒంగోలు కిషోర్, ఎం రాధిక, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ భాగీరథి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, జిల్లా మాస్ మీడియా అధికారి బి నరసింహారావు, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కెఎ రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, ఆరోగ్య విద్యా బోధకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాచపూడి నాగభూషణం కళాశాలలో ఎన్‌సిసి ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్ సెలెక్షన్స్







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 25)

విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవా భావాన్ని పెంపొందించడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) కీలక పాత్ర పోషిస్తుందని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ తెలిపారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎన్‌సీసీ ఆర్మీ ఎన్‌రోల్‌మెంట్ సెలెక్షన్స్‌లో మొత్తం 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా తమ కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్నామని గుర్తుచేశారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులలో దేశ సేవ పట్ల ఆసక్తి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే లక్షణాలు పెంపొందుతాయని పేర్కొంటూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఏఓ లలిత్ బాబు, ఎస్ఎమ్ సునీల్ కుమార్, నవాబ్ సుబేదార్ సుధీర్, శివ చరణ్ కుమార్, హవాల్దార్లు గణేష్, శశి కుమార్, సివిల్ స్టాఫ్ రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియను కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ బాల ఓబులేసు పర్యవేక్షించి, సమన్వయం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో పోలయ్య మృతి

### పోలయ్య భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన పలువురు నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 25)



బద్వేల్ పట్టణంలోని ఆంజనేయ నగర్ లో నివాసశీ వుండే బియ్యం వ్యాపారి పెరుమాళ్ళ పోలయ్య (56) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే బద్వేల్ మున్సిపాలిటీ పరిధి ఆంజనేయ నగర్‌లో నివాసం ఉండే పోలయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు కలరు. పోలయ్య హైదరాబాదు పోయి తిరిగి బద్వేల్‌కి వస్తూ ఉండగా ఓర్వకల్ దగ్గర ముందర వెళుతున్న లారీని బస్సు ఢీకొన్న ఘటనలో పోలయ్య మృతి చెందారు. పోలయ్య మృతి తెలుసుకున్న తర్వాత పట్టణంలో పలువురు దిగ్భ్రాంతికి గురయ్యారు. శుక్రవారం సాయంత్రం బద్వేల్ పట్టణానికి చేరుకున్న పోలయ్య భౌతికయానికి ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కనుమరుల పూటీ ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాలేపాటి సునీల్ కుమార్, మస్తాన్ బాబు, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ సముద్రాల పుల్లయ్య, రాగి మాన్ ప్రతాప్ కుమార్, మాజీ కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, కేవి సుబ్బారావు, కె మూర్తి, కె జయరాము, జొన్నలగడ్డ శేఖర్, మాకం బాల సుబ్బయ్య, వల్లం కొండు శివ, పలువురు వ్యాపారస్తులు, ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు పోలయ్య భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మంచితనానికి మారుపేరుగా ఉంటూ పలువురిలో మంచి పేరు ఉన్న పోలయ్య రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా మృతి చెందడం వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదంలో పోలయ్య మృతి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకులు రితేష్‌రెడ్డి, మున్సిపల్ నాయకులు వెంగల్‌రెడ్డి ఫోన్లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అమ్మానాన్నల కష్టానికి తగ్గ ప్రతిఫలం నీట్ పీజీ, గేట్‌లో సత్తా చాటిన బిడ్డలు





(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 25)

పట్టుదలతో చదివితే పేదరికం, గ్రామీణ నేపథ్యం విజయానికి అడ్డంకులు కావని నిరూపించారు మైదుకూరు మండలం అకులాయపల్లికి చెందిన సింగంశెట్టి కుటుంబానికి చెందిన విద్యావంతులైన బిడ్డలు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ ఎన్నో కష్టాలు ఎదుర్కొని తమ పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వగా వారి కష్టానికి తగ్గ ప్రతిఫలంగా ముగ్గురు సంతానం ఉన్నత స్థాయిలో స్థిరపడి కుటుంబానికి, స్వగ్రామానికి గర్వకారణంగా నిలిచారు. లింగంపల్లి గ్రామానికి చెందిన సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు మైదుకూరు మండలం అకులాయపల్లిలో స్థిరపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తమ పిల్లల చదువుకు మాత్రం ఎలాంటి లోటు రాకుండా కష్టపడ్డారు. తల్లిదండ్రుల ఆశయాలను అర్థం చేసుకున్న వారి ముగ్గురు పిల్లలు చదువుల్లో ప్రతిభ కనబరుస్తూ ఉన్నత విజయాలను సాధించారు.

**నీట్ పీజీలో ఆల్ ఇండియా 4447వ ర్యాంకు**

వారి కుమారుడు డాక్టర్ సింగంశెట్టి శ్రీనివాస కళ్యాణం కడప రిమ్స్ కళాశాలలో వీడీదీూ విద్యను పూర్తి చేశారు. ఇటీవల వెలువడిన నీట్ పీజీ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 4447వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**గేట్‌లో ప్రతిభ.. ఐఐటీ మద్రాస్‌లో ఎం టెక్**

వారి కుమార్తె సింగంశెట్టి ధరణి సైతం చదువుల్లో తన ప్రతిభను నిరూపించుకున్నారు. 2024 గేట్ పరీక్షలో దేశవ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు సాధించి ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ మద్రాస్‌లో ఎం.టెక్ విద్యను అభ్యసించారు. ఈ ఏడాది ఎం.టెక్ పూర్తి చేసిన ఆమె ప్రముఖ కంపెనీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా మంచి వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగం సాధించారు. ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ సభ్యులతో పాటు స్వగ్రామ ప్రజల్లోనూ ఆనందాన్ని నింపింది.

**ప్రభుత్వ ఉద్యోగంలో పెద్ద కుమారుడు**

కుటుంబంలోని పెద్ద కుమారుడు ఎస్. వెంకటేష్ సైతం ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రస్తుతం పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు పిల్లలు తమ తమ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం పట్ల తల్లిదండ్రులు వెంకటసుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**తల్లిదండ్రుల కష్టమే తమ విజయానికి కారణమంటున్న బిడ్డలు**

తమ విజయాల వెనుక అమ్మానాన్నల త్యాగం, కష్టం, ప్రోత్సాహమే ప్రధాన కారణమని సింగంశెట్టి కుటుంబానికి చెందిన బిడ్డలు పేర్కొంటున్నారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో ఏళ్ళుగా తల్లిదండ్రులు పడిన కష్టానికి ప్రతిఫలంగానే తాము ఈ స్థాయికి చేరుకున్నామని, తమ విజయాలను పూర్తిగా అమ్మానాన్నలకు అంకితం చేస్తున్నామని వారు భావోద్వేగంగా చెబుతున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ముగ్గురు సంతానం విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్నత స్థానాలను సాధించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని, తల్లిదండ్రుల ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం జాతీయ స్థాయిలో రాణించగలరని సింగంశెట్టి కుటుంబం విజయగాథ చాటిచెబుతోంది. ఈ సందర్భంగా సింగంశెట్టి కుటుంబాన్ని బంధువులు, మిత్రులు, గ్రామస్తులు అభినందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, సెప్టెంబర్ 25)

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో ఈ నెల 29వ తేదీన పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రామాపురం వద్ద సభ నిర్వహించే స్థలాన్ని, ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు.

ఈ కార్యక్రమానికి కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పార్టీ నాయకులు గుమ్మా శివ, నల్లూరి సూర్యనారాయణ, మచ్చా మనోహర్, భవనాసి వెంకటేశ్వర్లు, నీలిశెట్టి శివరామకృష్ణ, కోట కిషోర్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 25)

మాజీ పార్లమెంటు సభ్యులు, రొటేరియన్ స్వర్గీయ కోట సైదయ్య స్మారక గాంధీ జయంతి వేడుకలలో భాగంగా స్థానిక కెసిపి కమ్యూనిటీ హాల్ నందు నియోజకవర్గంలోని వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన, డిబేట్,క్విజ్ మరియు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దేశభక్తి గీతాలతో నృత్య పోటీల వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తూ కెసిపి జనరల్ మేనేజర్ వి వెంకటరమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు విద్యార్థులలో అంతర్గతంగా ఉండే సృజనాత్మకతను, నైపుణ్యతను, వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానం, భాషా నైపుణ్యం,పోటీ తత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు రోటరీ క్లబ్ వివిధ కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా వివిధ పాఠశాలల విద్యార్థుల మధ్య స్నేహస్ఫూర్తిని పెంచేందుకు దోహదపడతాయని కార్యదర్శి డాక్టర్ మూడవత్ దశరథ్ చౌహాన్, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ తిర్లిక శ్రీనివాసరావు ఆద్యాంతం గాంధీజీ జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలను, స్వాతంత్ర సమర స్ఫూర్తిని విద్యార్థుల్లో పెంపొందించే విధంగా క్విజ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్,ప్రముఖ వైద్యులు కొండవీటి రామకోటయ్య, కెసిపి హెచ్ఆర్ ఉదయ్ కుమార్, మాజీ రోటరీ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, ఆడిటర్ మస్తాన్ వలి, లీలా ప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, శారా స్వరూప, వివిధ పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.








## యర్రగొండపాలెం మండల స్పెషల్ ఆఫీసర్‌గా బాలు నాయక్ బాధ్యతలు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, సెప్టంబర్ 25)

యర్రగొండపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా బాలు నాయక్ శుక్రవారం ఉదయం బాధ్యతల స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన బాలు నాయక్ కు పలువురు మండల అధికారుల కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలు నాయక్ మాట్లాడుతూ మండల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టి సాధిస్తానని అన్నారు. అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శైలజ, ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 25)

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కరేడు ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో, అంగన్వాడి స్కూల్లో కూడా మొత్తం పిల్లలు 5386 మంది పిల్లలకి గాను 5160 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు మింగించడం జరిగింది. మొత్తం 95 శాతం మంది పిల్లలకు మింగించడం జరిగింది. మిగతా విద్యార్థులు అందరికీ అక్టోబర్ 5వ తేదీ మాప్ ఆప్ కార్యక్రమం జరుగుతుందని అప్పుడు మిగతా పిల్లలందరికీ వేయించడం జరుగుతుంది. కరేడు వైద్యాధికారులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శ్రీజారెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరిగింది. ఉలవపాడు హైస్కూల్ నందు డాక్టర్ శ్రీజారెడ్డి, కరేడు హై స్కూల్ నందు డాక్టర్ అనిల్ కుమార్ పిల్లలకు నులిపురుగుల వలన కలిగే నష్టాల గురించి వివరించి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ 400 ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలు తప్పకుండా వేసుకోవాలని భోజనానికి ముందు మలవిసర్జన అనంతరం చేతులు శుభ్రంగా కడుకోవాలని చేతులు శుభ్రంగా కడుక్కునే విధానం గురించి పిల్లలకు అవగాహన కూడా కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, పీహెచ్‌యన్ సీతారాములు, సూపర్వైజర్లు వసంత, శ్రీనివాసరావు, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ డి వార్మింగ్ డే



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 25)
మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కరేడు వారి సహకారంతో "నేషనల్ డి వార్మింగ్ డే" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ నులిపురుగులు చిన్న సమస్య కాదు అలాగని పెద్ద సమస్య కాదని చిన్న పిల్లలను వేధించే చికాకు సమస్య అని, ఆరోగ్యంగా పిల్లలు ఎదగాలంటే ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థ ఉండాలని, మనదేశంలో 65% మంది నులిపురుగులతో బాధపడుతున్నారని, ఆరోగ్యంవంతమైన పిల్లల భవిష్యత్తు కోసం నులిపురుగులను సమర్ధవంతంగా నిర్మూలించాలని తెలియజేశారు. తదనంతరం హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి సుజాత ఆధ్వర్యంలో నులి పురుగుల మాత్రలైన ఆల్బెండజోల్ విద్యార్థుల చేత మింగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ ఆరోగ్యశాఖ ప్రాథమిక కేంద్రం కరేడు వారు విద్యార్థులు ఎలా తమ చేతులను పరిశు భ్రంగా ఉంచుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## మండలంలో 10,800 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 25)
సంవత్సరం జాతీయ నులిపురుగుల దినోత్సవం ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరుగును మన పొదిలి మండలం యుపిహెచ్‌సి పొదిలి పరిధిలో పదివేల తొమ్మిది వందల పది టాబ్లెట్లు వచ్చాయి. మనకి వీటిలో పదివేల ఎనిమిది వందల పది మంది పిల్లలకి ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయించారు. 49 స్కూల్స్, 39 అంగన్వాడి సెంటర్స్, 10 కాలేజీల్లో ఉండే అందరి పిల్లలకి వేయించామన్నారు. అక్టోబర్ 5, 2026వ తేదీన మిగిలిన పిల్లలకి అందరికీ నులిపురుగులు టాబ్లెట్స్ వేయబడును. ఈ టాబ్లెట్లు నమిలి మిశీగవలెను. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రత పాటించాలి. అలాగే హ్యాండ్ వాష్ టిప్స్ తూచాతప్పకుండా పాటించాలి. దాంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలన్నారు. ఇవన్నీ పాటించగలిగితే మనం నులిపురుగుల బారిన పడకుండా ఉండగలమని యుపిహెచ్‌సి పొదిలి వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ కమిషనర్ రామ్మోహన్‌రావు, యూపీఎస్సీ పొదిలి వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర, హెల్త్ స్టాఫ్ శ్రీనివాసరెడ్డి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పై ప్రత్యేక అవగాహన కల్పించిన ఎస్ఐ శ్రీకాంత్



(షణ్ముఖవెలుగు, కొనకనమిట్ల, సెప్టంబర్ 25)
మండలంలోని చినారికట్ల గ్రామంలో శుక్రవారం రోడ్డు భద్రత పై ప్రత్యేక ఎస్ఐ శ్రీకాంత్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులలో భద్రతాభావం పెంపొందించడంతో పాటు హెల్మెట్ వాడకం పై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, ప్రయాణ సమయంలో వేగ పరిమితులు పాటించి, ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరంతో పాటు ప్రాణాంతకమన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ల వాడకాన్ని పూర్తిగా నివారించాలని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరు సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని కోరారు.

# జెడ్పీ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

### జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రారంభమైన ప్రత్యేకాధికారుల పాలన

### అన్ని మండలాలకు ప్రత్యేక అధికారుల నియామకం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టంబర్ 25)
వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ఇటీవల ముగిసిన నేపథ్యంలో, జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లా పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించగా, కడప జెడ్పీ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరికి జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుబ్రహ్మణ్యం, అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఈఓ పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం జెడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా పరిషత్‌కు సంబంధించి పలు అంశాల పై జెడ్పి సీఈఓతో చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించేందుకు బాధ్యతగా పనిచేయాలని, ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి జిల్లా కలెక్టర్, జెడ్పి ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జడ్పీ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, ఎన్నికైన సభ్యుల పదవీకాలం సెప్టెంబర్ 24తో ముగియడంతో, సెప్టెంబర్ 25 నుంచి ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లను జడ్పీలకు ప్రత్యేకాధికారులుగా నియమించింది. కొత్త పాలకవర్గం ఏర్పడే వరకు జెడ్పీ పరిపాలన ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో కొనసాగనుంది. అదే సమయంలో ఎంపీపీల పదవీకాలం కూడా ముగియడంతో వారి స్థానంలో అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను కూడా నియమించడం జరిగింది.





# ఘణంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టంబర్ 25)



చిన్నగంజాంమండలంలోని సోపిరాల గేటు సమీపంలోని బిజెపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉలిచి రాజేష్ కుమార్ అధ్యక్షతన పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అయిన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఉలిచి ఏసుబాబు మాట్లాడుతూ ఆయన చూపిన స్వయంసమృద్ధి (స్వదేశీ), దేశ నిర్మాణం, నిస్వార్థ సేవా మార్గంలో నడవడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు రేపాక మంగతాయారు, మెట్టు వెంకట సుబ్బారావు, బిఎల్ఏ 1 శిఖరం కోటయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు అనుమాల శెట్టి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మోటుమర్రి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

### సిపిఐ కార్యకర్తలకు దిశా నిర్దేశం
### పకడ్బందీగా ప్రణాళికలు ఉండాలి
### మార్కాపురం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం ఎల్ నారాయణ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టంబర్ 25)
స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని మార్కాపురం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కనిగిరి నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నియోజకవర్గ సిపిఐ సమితి సమావేశం ఎస్కేవై పెద్ద మస్తాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనలో సర్ ఓట్ల తొలగింపు 44 లక్షలు తొలగించారని, ఈవీఎంలతో పశ్చిమబెంగాల్ మధ్యప్రదేశ్ బీహార్ ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్ల చోరీకి పాల్పడ్డారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అవినీతి కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా మారినీత అక్రమాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం అంటే స్వచ్ఛందంగా ఒకరి ఆధీనంలో ఉండకుండా పనిచేస్తున్నటువంటి వ్యవస్థను జ్ఞానేశ్ కుమార్ సర్వనాశనం చేశాడని, ఆ పదవి నుండి అతడు తప్పుకోవాలని లేదంటే కేంద్రం చొరవ తీసుకొని అతన్ని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుతం కరువు తాండవిస్తుంటే దాని పైన చర్చించకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో 400 పై చిలుకు మండలాల్లో కరువు తాండవం చేస్తుందాన్నారు. ఎల్‌నినో ప్రభావం 12 నుండి 18 నెలలు ఉంటుందని అంచనా వేయడంలో విఫలం ప్రభుత్వం చెందిందని, మార్కాపురం జిల్లాలోని 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, జిల్లాలో కరువు సహాయ చర్యలు ఏర్పాటు చేయాలని, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రబాబు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారని, అటువంటి భూ దొంగలను గుర్తించి వారి దగ్గర నుంచి భూమిని స్వాధీనం చేసుకొని పేదవారికి రెండున్నర ఎకరా చొప్పున మంచి పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందించనున్న పెన్షన్లను అర్హులందరికీ అందే విధంగా చూడాలని, ఇల్లు లేని పేదవారికి ఇల్లు మంజూరు చేయాలని, భూమిలేని వారికి ప్రతి కుటుంబానికి ఇవ్వాలన్నారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ ఆసిన్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ కార్యకర్తలు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతం దిశగా కార్యకర్తలు కృషి చేయాలని అందుకు అనుగుణంగా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు పోతుల ప్రభాకర్, మండల కార్యదర్శులు గులాం హుస్సేన్, మస్తాన్‌రావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు వజ్రాల సుబ్బారావు, పందిటి మోహన్, ఏఐఎస్ఎఫ్ పవన్ కళ్యాణ్, మస్తాన్, మండల కార్యదర్శులు గులాం హుస్సేన్, పాలపర్తి మస్తాన్, రాగిపాటి సూరిబాబు, మీరావలి, పాలపర్తి మస్తాన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్ కళ్యాణ్, రాగిపాటి సూరిబాబు, బాలకోటయ్య, గొర్రెముచ్చు తిరుపాలు, వెలుగొండయ్య, షరీఫ్, అమరుల్లా, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సమర్పించిన 62 అర్జీలపై తక్షణ చర్యలు

### ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 25)
ఒంగోలు నగరంలోని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 62 అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే, ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అందజేసిన అర్జీలపై సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.







# పెళ్లూరు ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం ఆటోను ఢీకొన్న రెడీమిక్స్ లారీ నలుగురికి గాయాలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 25)**

ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెళ్లూరు ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి వస్తున్న ఏపి 39 యు 4762 నంబర్ గల ఆటోలో డ్రైవర్, అతని భార్య, మనవరాలు ప్రయాణిస్తున్నారు. పెళ్లూరు ఫ్లైఓవర్ పై నుంచి ఆటో కిందకు దిగుతున్న సమయంలో నెల్లూరు వైపు వెళు_న్న టిజి 29 టి 0449 నంబర్ గల రెడీమిక్స్ లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి రక్తగాయాలయ్యాయి. ఆటోను ఢీకొన్న అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ఫ్లైఓవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటన పై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నీట్ పీజీ ఫలితాలలో బద్వేల్ ఆణిముత్యం అశ్విత రాయల్ ఆల్ ఇండియాలో 1100వ ర్యాంక్ సొంతం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 25)**

జాతీయ స్థాయిలో విడుదలైన నీట్ పీజీ (నీట్ పీజీ) ఫలితాలలో బద్వేల్ పట్టణానికి చెందిన అశ్విత రాయల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఆల్ ఇండియా స్థాయిలో 1100వ ర్యాంకు సాధించింది. పట్టణంలో పేరుగాంచిన రాయలసీమ స్కూల్ కరస్పాండెంట్ గొడిశిపాటి అంకయ్య, రుక్మిణి దంపతుల కుమార్తె అయిన అశ్విత, తన ఘనవిజయంతో బద్వేల్ ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది.

**తల్లిదండ్రుల నిరంతర కృషి.. కుమార్తె గర్వకారణమైన సాధన:**

అశ్విత చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచేది. కుమార్తె విద్యాభివృద్ధిని కాంక్షించి, ఆమెను చిన్ననాటి నుంచే ఉత్తమమైన పాఠశాలలు మరియు కళాశాలల్లో చదివించి, నిరంతరం ప్రోత్సహిస్తూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. వారి ఆశయాలను నిజం చేస్తూ, నేడు జాతీయ స్థాయిలో 1100వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, అత్యంత గర్వంగా ఉందన తెలిపారు. భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా రూపుదిద్దుకుని, తమ సొంత ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అశ్విత కృషి చేస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన అశ్విత రాయల్‌కు బద్వేల్ పట్టణంలోని పలువురు నాయకులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. బద్వేల్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయాల తరఫున ఆలయ నిర్వాహకులు వల్లశీ కొండు వెంకటరమణ, నిమ్మకాయల గురివిరెడ్డి, సీనియర్ అడ్వకేట్ త్రివికమ్ సింగ్, వల్లం కొండు శివ శివారెడ్డి అలాగే రాయలసీమ ఇంగ్లీష్ మీడియం నిర్వాహకులు మన్యం చిన్నపరెడ్డి, పలువురు నాయకులు పాఠశాలల యాజమాన్యం వారు బంధుమిత్రులు ప్రతినిధులు ఆమెను ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీస్సులను అందించారు.

# పోరుమామిళ్లలో అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం అంగన్వాడీ ఉత్సవంలో పలువురి ప్రశంసలు

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 25)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పోరుమామిళ్ల మండలం రామాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సీడీపీఓ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, మండల అధ్యక్షుడు నాగేంద్ర ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్ర లు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, పోషణ, శారీరక ఎదుగుదలతో పాటు విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు అత్యంత ప్రశంసనీయమని కొనియాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమయానుకూలంగా పోషకాహారం అందించడం, పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించడం, ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ,




జిల్లా అధికార ప్రతినిధి నారోజు రమణ చారి, బద్వేల్ టౌన్ అధ్యక్షుడు దరిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్, అంగన్‌వాడీ సమన్వయకర్త మనోహర్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మండల ఉపాధ్యక్షులు చెన్నయ్య, బ్రహ్మయ్య, తమ్మిశెట్టి రమణ, కార్యదర్శి మోహన్ రెడ్డి, జనసేన నాయకుడు రమణయ్య, నాగిరి, ఇమ్రాన్ షేక్, ఓబీసీ మోర్చా నాయకుడు శ్రీను, యువ నాయకుడు భరత్, మహిళా నాయకురాలు ధనలక్ష్మి, వెంకటేష్, రామాయణపు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీంద్రలతో పాటు అంగన్‌వాడీ సూపర్ వైసర్లు మాధవి, చంద్రకళ, హరిప్రియ, రత్నకుమారి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించడం పట్ల స్థానికులు, అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.





# మొట్ట మొదటి ఔషద వేత్త (ఫార్మసిస్టు) శుషేణుడు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 25)**



బెల్లంకొండ ఫార్మసి కాలేజీలో అంతర్జాతీయ ఔషద దినోత్సవం (ఫార్మసిస్ట్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ మెహ్రాజ్ అధ్యక్షోపాన్యాసంలో టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఫార్మా సూటికల్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 25 న ప్రపంచ ఔషద దినోత్సవంగా నిర్వహించాలని అధికారికంగా ప్రకటించారని తెలియ జేశారు. అమెరికాలో వివిధ వృత్తులలో పనిచేస్తున్న వారిలో అత్యంత విశ్వసనీయత, ప్రమాణాలు పాటిస్తున్న నిపుణులు,పార్మసిష్టులు రెండవ స్థానంలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పొదిలి మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు ప్రసంగిస్తూ ప్రపంచంలో ఫార్మసీరంగం భారతదేశం ప్రధాన భూమిక పోషిస్తుందని, ప్రస్తుతం మన ముందు ఫార్మసీ విద్యార్థులకు మంచి బంగారు, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని,విద్యార్థులు నాణ్యమైన, సాంకేతికతను, నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని,మన పూర్వీకులు ఋషులు అందించిన జ్ఞానంతో పాటు, నూతన ఆవిష్కరణలు చేసి, నాణ్యమైన ఔ షదాలు కనుగొని, పేద ప్రజలకు మందులు అందుబాటు లోనికి తీసుకుని వచ్చి,ప్రపంచమంతా ఆరోగ్యవంతమైన నాడు "సర్వేజనా సుఖినోభవంతు" అనే సూక్తి అమల్లోకి వస్తుందన్నారు. బిట్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ప్రపంచంలో మొట్టమొదటి ఫార్మసిస్టు లిశుషేణుడు అన్నారు. రామ – రావణ యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లిన సందర్భంలో రావణాసురుని ఆస్థాన ఔషదవేత్త (ఫార్మసిష్టు) అయిన శుషేణుడు సలహామేరకు ఆంజనేయస్వామి హిమాలయాలలోని ద్రోణగిరి పర్వతం నుంచి సంజీవని దివ్య మూలికను తీసుకొని వచ్చి చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు గుర్తు చేశారు. రోగికి వైద్యం చేసి ఔషదాల ద్వారా ప్రాణం పోసేది వైద్యులు అయితే ఆ ఔషదాలకు ప్రాణం పోసేది ఫార్మశిష్టులైన ఔషద నిపుణులన్నారు. అలాగే వైద్యులు (డాక్టర్లు) రోగాన్ని గుర్తిస్తే దానికి సరిపడ మందులు ఇచ్చి నయం చేసేది ఫార్మశిష్టులన్నారు. బిట్స్ విద్యాసంస్థల సిఈఓ బెల్లంకొండ విజయలక్ష్మి ప్రసంగిస్తూ రోగులకు – వైద్యులకు తిరుగులేని వారధులు, అనుసంధాన కర్తలే ఫార్మశిష్టులన్నారు. ఔషద రంగంలో మందుల తయారీలో ఫార్మ శిష్టులు అత్యంత కీలకపాత్ర పోషిస్తారు. ప్రకృతి విపత్తుల (కరోనా) సమయంలో విలువ కట్టలేని సేవలు అందించడమే కాకుండా ప్రపంచ దేశాలకు మందులు తయారుచేసి, సరఫరా చేసి ప్రజల ప్రాణాలు కాపాడటంలో ఫార్మసిస్టులు కీలకమైన పాత్ర పోషించారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. విద్యాసంస్థలు డైరెక్టర్ కుమారి బెల్లంకొండ సాహితీ రాయల్ ప్రసంగిస్తూ మీరు ఈ రోజు నిర్వహించేది కేవలం ఇది ఒక సమావేశం మాత్రమే కాదు. జ్ఞానం ఆవిష్కరణ జరుపుకునే ఒక వేడుక. ఔషద శాస్త్రం (ఫార్మసీ కోర్స్) అంటే కేవలం మందులు తయారు చేయడం మాత్రమే కాదు, ఔషద శాస్త్రం జీవితాలను మెరుగుపరచడం, సురక్షితమైన ఆరోగ్య సంరక్షణతో పాటు లక్షల మంది ప్రజలకు ఆశ కలిగించడం. ఈ శాస్త్రం సేవతో కలిసే వృత్తి బాధ్యత, కరుణతో కలిసే వృత్తి అన్నారు.

వీరిశెట్టి విద్యాసంస్థలు డైరెక్టర్ కుమారి మద్దుల ఛార్మి, డింపుల్, లక్ష్మికుమారి, అధ్యాపకులు హామీద, బి అర్చన, పి స్వర్ణ ప్రియ, పఠాన్ అబ్దుల్ రహ్మాన్ ఖాన్, నేలటూరి డిబ్బారెడ్డి, భార్గవ నాయుడు, శివ ప్రసాద్ రాజు, రఫీ, విద్యార్థులు తమ ప్రసంగంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఫార్మసిస్టుల పాత్రను గురించి వివరించారు. సాంస్కృతిక, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.




# వీరేపల్లి ఎస్టీ కాలనీలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 25)**

మండలంలో వీరేపల్లి సెక్టార్‌లోని వీరేపల్లి ఎస్టీ కాలనీ నందు శుక్రవారం సిడిపిఓ డి మాధవి లత, సూపర్వైజర్స్ కె రమాదేవి, ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు, తల్లులకు పోషకాహారం గురించి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే బాలామృతం బాలసంజీవుని కిట్లు ప్రోటీన్ ఫుడ్స్, పాలు, గుడ్లు, ఆకుకూరలు జెండాకి ఎన్ని రంగులు ఆ రంగుల వర్ణం ఉన్న ఫుడ్స్ గురించి ఆకుపచ్చని వర్ణంలో ఉన్న ఆకుకూరలుకూరగాయలు తెలుపు వర్ణంలో ఉండే పాలు గుడ్లు, ఫుడ్స్ గురించి క్యారెట్ కూరగాయలు గురించి తెలియజేశారు. ఆరు నెలలు నిండిన తర్వాత బిడ్డకు తినిపించాల్సిన ఆహారం గురించి ఇమ్యునైజేషన్ గురించి పిఎంఎంవివై ప్రధానమంత్రి మాతృత్వ వందన పథకం గురించి అంగన్వాడీ సెంటర్లో ఇచ్చే ఫుడ్స్ గురించి తల్లులకు 6 నెలలు నిండిన బిడ్డలకు సమతుల్యమైన ఆహారం. వివిధ రకాలలో ఎలా తినిపించాలి. మాంసాహారం శాఖాహారం పిల్లలకి ఏ నెలలో ఏ రకాలుగా తినిపించాలి. ఎంత క్వాంటిటీలో తినిపించాలనీ తల్లులకు తెలియజేశారు. చక్కెర ఉప్పు నూనెలు ఎక్కువ వాడకం వల్ల వచ్చే సమస్యల గురించి. గర్భవతిగా ఉన్నప్పటి నుంచి బిడ్డ రెండు సంవత్సరాలు నిండే వరకు వెయ్యి రోజులు తల్లి బిడ్డ సంరక్షణ గురించి తల్లులకి అవగాహన కల్పించారు. ఈ 25 సంవత్సరాల పోషణ మహా కార్యక్రమంలో అన్ని విషయాలలో పూర్తి సహకారాలు అందించినటువంటి అంగన్వాడి, కార్యకర్తలను స్థానికులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధు, ఎంఎల్‌హెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆర్‌బికే, ఆశ వర్కర్లు, గర్భిణీలు పాలిచ్చే తల్లులు, పిల్లల తల్లులు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

# కంభం టీచర్‌కు అరుదైన గౌరవం విద్యార్థుల సంఖ్య పెంపులో విశేష కృషికి ప్రశంసాపత్రం



**(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 25)**

మండలంలోని ఎన్‌ఆర్ తురిమెళ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ భాస్కర్ నాయుడుకి అరుదైన గౌరవం లభించింది. గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంపొందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసినందుకు ఆయనను పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు అభినందించారు. శుక్రవారం పొదిలిలోని సాయి బాలాజీ కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు చేతుల మీదుగా భాస్కర్ నాయుడుకి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించి, నాణ్యమైన విద్య అందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంపొందించేందుకు భాస్కర్ నాయుడు చేస్తున్న కృషిని అధికారులు ప్రశంసించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఆయన తీసుకున్న ప్రత్యేక చర్యలు, విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు విద్యావేత్తలు భాస్కర్ నాయుడు పై ప్రశంశల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల్ సత్తార్, పత్తి శ్రీనివాసులు, సిఆర్పీలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహణ






(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 25)

తక్కెళ్లపాడు సచివాలయం పరిధిలోని కంచర్లవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా అధ్యక్షుడు మల్లెల గోమ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువు, ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల సేవలను గుర్తించి శాలువాలతో సన్మానించారు. చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని మల్లెల గోమ్స్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ పోలేరమ్మ అమ్మవారికి సారె సమర్పణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, సెప్టెంబర్ 25)

మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ శాంతినగర్ నందు గ్రామ పెద్దలు, మహిళలు ఆధ్వర్యంలో గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లికి శుక్రవారం విశేష పూజాలో భాగంగా సారె కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత అయిన పోలేరమ్మను తమ సొంత ఇంటి ఆడపడుచుగా భావించి ఉదయం నుంచే వేలాది మహిళలు పోలేరమ్మ తల్లికి సారెగా పట్టుచీర, జాకెట్ ముక్కపసుపు, కుంకుమ, గాజులు, కాటుక, ఒడి బియ్యం, రకరకాల పిండివంటలు, పండ్లు, పూలు తీసుకుని గ్రామంలో శోభాయాత్రగా బయాలుదేరి మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ళతో వేడుక  సారెను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాలు విద్యుత్ దీపాలు, తోరణాలతో ఎంతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# మాచర్లలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

## కళా పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా ఎస్పీబి వర్ధంతి

## ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాట ఉన్నంతవరకు చనిపోయినా సజీవుడే

## డాక్టర్ కమలాసన్‌రావు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 25)



గాన గంధర్వుడు, గొప్ప నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాట బ్రతికున్నంత వరకు  చనిపోయినా లోకంలో సజీవంగా ఉన్నట్లేనని డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ముటుకుల కమలాసన్ రావు అన్నారు. మాచర్లలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 6వ వర్ధంతి కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలోని రామాటాకీస్ లైన్లో ఉన్న కౌముధి స్కానింగ్ సెంటర్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమలాసన్ రావు మాట్లాడుతూ బాలసుబ్రహ్మ ణ్యం అన్ని భాషలలో 40 వేలకు పైగా పాటలు పాడిన గొప్ప గాయకుడని, ఆయన పాడిన భక్తి పాటలను ప్రతి రోజు దేవాలయాల పై ఉదయాన్నే వింటూ భక్తిపారవశ్యంలో తరించిపోయే వారు ఎంతో మంది ఉన్నారని అన్నారు. భక్తి పాటలే కాకుండా లవ్ మెలోడీ, ట్రాజిడీ,హాస్యం,శృంగార భరితమైన పాటలు, యువతను, ఉర్రూతలూగించే హుషారైన పాటలు ఇలా అన్ని వయస్కుల వారు ఆసక్తిగా వినగలిగే పాటలు పాడిన గొప్ప గాయకుడని, అంతటి గాయకుడు తెలుగు సినీ పరిశ్రమలో పుట్టబోడని కొనియాడారు. కరోన మహమ్మారి ఆయనను పొట్టన పెట్టుకుందని, ఆయన మరణం సంగీత ప్రియులకు, తెలుగు ప్రజలకు తీరని లోటును మిగిల్చిందని అన్నారు. ఈటీవీలో ప్రారంభించిన పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా అనేక మంది గాయనీ గాయకులను తయారుచేసి సినీ పరిశ్రమకు అందించిన ఘనత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకే దక్కుతుందన్నారు. అనంతరం కళా పరిషత్ అధ్యక్షులు పఠాన్ జాన్ ఖాన్ మాట్లాడుతూ డాక్టర్ ఎస్పి బాలసుబ్రహ్మణ్యం కళా పరిషత్ పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జూన్ మాసంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో మాచర్ల పట్టణంలో కనీవినీ ఎరుగని రీతిలో “స్వర నీరాజనం“ మెగా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ పోటీలకు సుమారు 150 మంది గాయనీ గాయకులు పాల్గొనడం జరుగుతుందన్నారు.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గొప్ప గాయకుడని, ఆయన పాడిన పాటలను వింటుంటే ఎంతటి బాధనైనా మరిచిపోయే విధంగా మనసు ఉల్లాసంగా ఉంటుందని, పాట ఉన్నంతవరకు ఆయన ప్రతి ఒక్కరిలో బ్రతికే ఉంటారని అన్నారు. కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు 2001లో పద్మశ్రీ అవార్డు, 2011లో పద్మభూషణ్, ఆయన మరణానంతరం పద్మవిభూషణ్ అవార్డులు ఇచ్చి  భారత ప్రభుత్వం ఘనంగా సత్కరించినట్లు పేర్కొన్నారు. అంతేకాక తెలుగు సినీ పరిశ్రమలో ఫిలింఫేర్, సైమా అవార్డులతో పాటు పలు భాషల్లో పాడిన పాటలకు ఆయా రాష్ట్రాలకు చెందిన సినీ పరిశ్రమలు, ప్రభుత్వాలు అనేక అవార్డులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కళాపరిషత్తు తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాగులూరి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు కె శివశంకర్, గట్ల కోటిరెడ్డి, ఇల్లూరి పుల్లారెడ్డి, పులుసు శ్రీనివాసరెడ్డి, బాహాటం శేషగిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కందుల






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 25)

జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంకజ్ కుమార్ మీనాను శుక్రవారం జిల్లాపోలీసు కార్యాలయంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలోని శాంతి భద్రతల విషయం పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా బిజెపి అధ్యక్షులు పి వి కృష్ణారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# కస్తూరిరెడ్డికి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 25)

కనిగిరి మండల జడ్పీటిసి మడతల కస్తూరిరెడ్డి పదవికాలం ముగియడంతో జడ్పీటిసి కార్యాలయంలో శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, పచ్చువ సుబ్బయ్య, శేషిరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, నారాయణ, మిట్ట రమేష్, నాయకులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదల నివారణనే లక్ష్యం

## సిఐ మల్లికార్జున

## కంభం, బేస్తవారిపేట పరిధిలో ప్రమాదకర ప్రాంతాల పరిశీలన

(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 25)

మార్కాపురం జిల్లా నూతన ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు కంభం సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కంభం, బేస్తవారిపేట పరిధిలో చేపట్టిన ఈ తనిఖీల్లో జాతీయ రహదారుల సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది, మార్కాపురం మోటారు వాహనాల తనిఖీ అధికారి, సీఐ మల్లికార్జున, స్థానిక ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాలకు కారణమయ్యే రహదారి భద్రతా లోపాలను అధికారులు పరిశీలించారు. ముఖ్యంగా హెచ్చరిక బోర్డులు లేకపోవడం, వాహనాల వేగాన్ని నియంత్రించే రంబుల్ పట్టీలు లేకపోవడం, శాస్త్రీయ పద్ధతులకు విరుద్ధంగా మధ్య విభజనల వద్ద దారులు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించారు. ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల సంస్థ సిబ్బందికి సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ పట్టీలు ఏర్పాటు చేయడం, వాహనదారులకు రహదారి కనిపించకుండా అడ్డుగా ఉన్న వస్తువులను తొలగించడం, అనధికారిక మధ్య విభజన దారులను మూసివేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే సిఐ మల్లికార్జున మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా హైవేపై పోలీసుల గస్తీని మరింత పెంచి , అతివేగంగా ప్రయాణించే వాహనాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానిక ఎస్ఐ లకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ, జాతీయ రహదారుల సంస్థ అధికారులు సమన్వయంతో చర్యలు కొనసాగించనున్నట్లు కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



